క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ఏఈ బసవరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో ఏబీ స్విచ్ ఏర్పాటు చేస్తున్నందున మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దొడ్లేరు, ఆవులవారిపాలెం, పెరికపాడు, హసనాబాద్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రేపు గాయత్రి యజ్ఞం

ముప్పాళ్ల: మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలోని సాందీపని ఆశ్రమం 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం 24 కుండముల గాయత్రి మహాయజ్ఞం జరుగుతుందని ఆశ్రమ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వసంత పంచమి పురస్కరించుకొని సరస్వతిపూజ, అక్షరాభ్యాసం కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

క్రీస్తు నగర్‌లో వైద్య పరీక్షలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని క్రీస్తు నగర్, బీఎస్ఎన్ఎల్ బజార్ ప్రాంతాల్లో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాంలో భాగంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. సమాచారాన్ని డిజిటైజ్ చేసినట్లు వైద్యురాలు శ్వేత తెలిపారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించి పరీక్షలు చేసి గర్భకోశ వ్యాధులు, రొమ్ము క్యాన్సర్ కారకాలను గుర్తించేందుకు స్మీర్‌ను సేకరించి వాటిని పరీక్షలు చేసేందుకు ఉన్నత వైద్యశాలకు పంపిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్, చిన్నారులకు హిమోగ్లోబిన్ పరీక్షలు ,(బీఎంఐ)బాడీ మాస్ ఇండెక్స్ వంటి పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సత్కారం



గుడిపాడు(క్రోసూరు): మండలంలోని గుడిపాడు జెడ్పీ పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు గాలి సురేష్ బాబు శుక్రవారం పదవీ విరమణ పొందిన సందర్భంగా ఏపీ ఎస్టీయూ ఘనంగా సత్కరించింది. ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు సాతులూరి రాఘవ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా 32 సంవత్సరాలు సేవలందించిన సురేష్ బాబు శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో గడపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎంవీ రవికాంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జి.సదాశివరెడ్డి, రవికుమార్, టి.ప్రకాశ్‌రావు, ఏపూరి వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ చైర్మన్ వి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్రం భూములను కాపాడండి



అమరావతి: లేమల్లె గ్రామ శివారులోని 14వ మైలు సెంటర్‌లో 1931లో గుంటూరు నివాసి తల్లం శాస్త్రులు స్థాపించిన రాఘవేంద్రస్వామి ట్రస్టు భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికుడు ఎస్.శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో తహసీల్దారు డానియల్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ ట్రస్టు స్థాపించి దాని నేతృత్వంలో బాటసారులకు అన్నపానాదులకోసం సత్రం నిర్మించారన్నారు. సత్రం నిర్వహణకు 10 ఎకరాల 52 సెంట్ల భూమిని సమకూర్చినట్లు చెప్పారు. శాస్త్రులు తదనంతరం 2014 వరకు సత్రం శిథిలావస్థకు చేరి పాడుబడిపోయినా ఎవరు పట్టించుకోలేదన్నారు. అమరావతి రాజధానిగా ప్రకటించిన నేపథ్యంలో భూముల రేట్లు పెరగడంతో తామే తల్లం శాస్త్రులు వారసులమంటూ తల్లం వెంకటశేషగిరి, మనోజ్‌కుమార్, శ్రావణ్‌కుమార్ ప్రత్యక్షమయ్యారన్నారు. ఈ క్రమంలో బాటసారులకోసం తీసిన భావిని పూడ్చి వేసి, ప్రజల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టర్‌ను కూడా కూలి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారన్నారు. అలాగే సత్రం భూములను ఆక్రమించి సత్రం స్థలంలో తాత్కాలికంగా నివాసం ఉంటున్న వారిపై దౌర్జన్యం చేసి బయలకు మొత్తం భూములను హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారుని కోరినట్లు చెప్పారు. బి.వైశల్ నాయక్, బి.సుధా, ఎస్కే షైగంబర్, ఎం.నాగేశ్వరరావు, రాములునాయక్ పాల్గొన్నారు.

బాదుడే.. బాదుడు!

- నేటి నుంచి పెంచిన రిజిస్ట్రేషన్ చార్జీలు అమలు
- ప్రాంతాన్ని బట్టి 10 నుంచి 40 శాతం పెంపు
- ఇప్పటికే కుదేలైన రియల్ ఎస్టేట్ రంగం
- తాజా పెంపుతో మరింత పతనమేనంటున్న వ్యాపారులు

కూటమి ప్రభుత్వం బాదుడు కొనసాగుతోంది. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, చేతులెత్తేసిన ప్రభుత్వం.. ప్రజలపై మాత్రం మోయలేని భారాలు మోపుతూనే ఉంది. నిత్యావసరాలు, విద్యుత్ చార్జీల బాదుడుకు అదనంగా నేటి నుంచి భూ రిజిస్ట్రేషన్ల విలువ పెంపు రూపంలో మరో బాదుడు మొదలెట్టింది. నూతన స్థలం, గృహం కొనుగోలు చేయాలనే సామాన్యుల ఆశను చిదిమేసే దిశగా మార్కెట్ విలువను భారీగా పెంచేసింది. అందిన కాడికి దండుకోవడమే ధ్యేయంగా ప్రభుత్వం స్కెచ్ వేసింది. సత్తెనపల్లి నియోజకవర్గంలో 10 నుంచి 40 శాతం వరకు రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నాయి.

సత్తెనపల్లి: రాష్ట్రంలో భారీగా రిజిస్ట్రేషన్ చార్జీలు శనివారం నుంచి పెరగనున్నాయి. పట్టణం, గ్రామాలు అనే తేడా లేకుండా ప్రాంతాన్ని బట్టి 10 నుంచి 40 శాతం మేర చార్జీల బాదుడు ఉంటుంది. భూములు, నివాస అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల విలువ అమాంతం పెంచడంపై సామాన్య, మధ్యతరగతి వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేది లేదంటూ కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన మాటను కేవలం ఎనిమిది నెలల్లోనే తప్పారు. సత్తెనపల్లి రెవిన్యూ డివిజన్ పరిధిలో సత్తెనపల్లి, పెదకూరపాడు, అమరావతి, క్రోసూరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి.

మధ్యతరగతి పై భారం...

తాజా రిజిస్ట్రేషన్ల ధరల పెంపుతో మధ్యతరగతి సొంతింటి కల మరింత భారం కానుంది. పైసా పైసా పొదుపు చేసుకుని ఆపై బ్యాంకు రుణంతో ఈ ఏడాది ఓ 100 చదరపు గజాల స్థలాన్ని తీసుకోవాలని ఆశపడ్డ వారు మరో ఐదారేళ్లు వెనకడుగు వేయాల్సిందేనని రియల్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్‌లోని పలు గ్రామాల్లో జాతీయ రహదారుల విస్తరణ సమయంలో ఈ రిజిస్ట్రేషన్ ధరలు పెంచినట్లయితే రైతులకు పరిహారం చెల్లింపులో భారీ లబ్ధి చేకూరేదని స్థానికులు చెబుతున్నారు. అన్ని అయిపోయాక రిజిస్ట్రేషన్ ధరలు పెద్ద మొత్తంలో పెంచడం సామాన్యుల నడ్డి విరిచేందుకేనని ఆక్షేపిస్తున్నారు.

రియల్ ఎస్టేట్‌పై తీవ్ర ప్రభావం

మార్కెట్ విలువలను పెంచాలనే ప్రభుత్వ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి అశనిపాతంలా పరిణమించింది. నిజానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. ప్లాట్ల కొనుగోలు నిత్యం జరిగేవి. దీంతో ఈ వ్యాపారంలోకి వివిధ రంగాల వారు ప్రవేశించారు.



సత్తెనపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద క్రయ విక్రయదారులు

ఈ తరుణంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్ ఒక్కసారిగా కుదేలైంది. రిజిస్ట్రేషన్‌ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. భూముల విలువలను భారీగా పెంచడం దీన్ని కోలుకో లేని విధంగా దెబ్బతీయనుంది. దీనిపై స్థిరాస్తి వ్యాపారాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కిటకిటలాడిన రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

సత్తెనపల్లి రెవిన్యూ డివిజన్‌లోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు క్రయ విక్రయదారులతో శుక్రవారం కిటకిటలాడాయి. ఒక్క రోజే పాత రేట్లతో రిజిస్ట్రేషన్‌లకు అవకాశం ఉండటంతో క్రయ విక్రయ దారులు ఒక్కసారిగా కార్యాలయాలను చుట్టుముట్టారు. సర్వర్ కాస్త సతాయిస్తుండడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పత్రాలు చేతబట్టి బారులు తీరారు. దీన్ని అదునుగా తీసుకున్న ప్రైవేటు వ్యక్తులు ఒక్కో డాక్యుమెంటుకు ఒక్కో రీతిలో వసూళ్లకు పాల్పడ్డారు. అవసరాన్ని ఆసరాగా చేసుకుని ముక్కు పిండి వసూళ్లకు పాల్పడ్డారు. భారీగా కమిషన్లు దండుకున్నారు.

నేటి నుంచి పెంచిన చార్జీలు అమలు



రిజిస్ట్రేషన్‌పై పెంచిన చార్జీలు శనివారం నుంచి అమల్లోకి వస్తాయి. ఆయా ప్రాంతాల్లోని భూములు, ఇతర ఆస్తుల విలువలను బట్టి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. చివరి రోజు కావడంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. దళారులు, ప్రైవేటు వ్యక్తులను అనుమతించకుండా పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు చేపడుతున్నాం.

–బి.అశోక్‌కుమార్, సబ్‌రిజిస్ట్రార్, సత్తెనపల్లి

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ముప్పాళ్ల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎం.భవానిశంకర్



రాజుపాలెంలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రాజుపాలెం: కృష్ణా – గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల స్థాయి అధికారులు శుక్రవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. రాజుపాలెం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలో రెండు పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు దుర్గేష్‌రావు, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఎస్ఐ వేణుగోపాల్ సందర్శించారు. వసతులపై పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు సూచనలు ఇచ్చారు. మండలంలో మొత్తం పట్టభద్రుల ఓట్లు 1,369 ఉండగా అందులో పురుషులు 950, స్త్రీలు 319 మంది ఉన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉన్నందును సభలు, సమావేశాలు నిర్వహించరాదని తహసీల్దారు తెలిపారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: కృష్ణ, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, పాత కేంద్రీయ విద్యాలయంలో పోలింగ్ బూత్‌లను సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణాకాంత్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పట్టణానికి సంబంధించి ఐదు పోలింగ్ కేంద్రాలు, పాత కేంద్రీయ విద్యాలయంలో సత్తెనపల్లి రూరల్ మండలానికి సంబంధించి రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటన్నిటిని పరిశీలించారు. ఆయనతో పాటు తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, ఆర్ఐ బోస్‌బాబు ఉన్నారు.

ముప్పాళ్లలో..


ముప్పాళ్ల: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రులు ఎన్నికలకు సంబంధించి ముప్పాళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎం.భవానిశంకర్ శుక్రవారం పరిశీలించారు. మండలంలో రెండు పోలింగ్ కేంద్రాల ద్వారా 1,468 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. వీరిలో 971 మంది పురుషులు, 497 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీ ప్రసాదు, ఆర్.ఐ ఆంజనేయులుపాల్గొన్నారు.

కమిషనర్, టీపీఎస్‌లకు ఉద్యోగోన్నతి



సత్తెనపల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కొలిమి షమ్మి, టీపీఎస్ రిజ్వానా పదోన్నతులు పొందారు. కమిషనర్ కొలిమి షమ్మి గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ 2 మున్సిపల్ కమిషనర్‌గా, రిజ్వానా టీపీఓగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కంట్రీ అండ్ ప్లానింగ్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అంతేకాక ఆమెను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. కమిషనర్ షమ్మి, టీపీఓ రిజ్వానాలను మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయాల కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది శుక్రవారం సత్కరించారు. మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, డీఈ తోట వెంకటరమణ, సందెపోగు శ్రీనివాసరావు, షేక్ కరీముల్లా, షేక్ అబ్దుల్ కరీం, రెబ్బవరపు సురేష్, జింకా నళిని, తిరుమల లక్ష్మి, రేచల్, షేక్ సైదా, గంట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని అరికట్టాలి



నకరికల్లు: వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ జి.కాశయ్య సూచించారు. ఎంపీపీ మేచారపు అనురాధ అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పాడైపోయిన తాగునీటి చేతి పంపులకు మరమ్మతులు చేయించాలని కోరారు. పలుచోట్ల వాటర్ పైపులైన్ దెబ్బతిని ఉందని బంగ్లా గడ్డ, సినిమా హాలు బజారు తదితర ప్రాంతాలకు తాగునీటి వసతి పునరుద్ధరించాలని కోరారు. ఆయుర్వేద వైద్యశాల భవనానికి మరమ్మతులు చేపట్టి డాక్టర్ ప్రతిరోజు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ కె.దేవదాసు, పీఆర్ ఏఈ సురేష్, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గొంతెండక ముందే స్పందించండి



పాముల కాలనీలో విద్యుత్ మోటార్ ద్వారా నీటి వినియోగం




పెదకూరపాడు ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా..

పెదకూరపాడు: వేసవి సమీపిస్తోంది. భూగర్భ జలాలు అడుగంటి.. నీటి ఎద్దడి పునరావృతం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో సగం తాగు, ఇతర అవసరాలను చేతి పంపులే తీరుస్తాయి. అలాంటి బోర్లు ప్రస్తుతం మరమ్మతులకు గురై వృథాగా మారాయి. నీటి సమస్యను ఎదుర్కోవడంలో అప్రమత్తంగా ఉండాల్సిన గ్రామ, మండల స్థాయి అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదు.చేతి పంపులు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గంలో మొత్తం అధికారకంగా 3,472 చేతి పంపులు ఉన్నాయి. వాటిలో 180 చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయి. ఇవీ కాకుండా స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాటు చేసిన బోర్లు కూడా నిరుపయోగంగా ఉన్నాయి.

గర్భిణులకు సకాలంలో వైద్య సేవలందించాలి

లంకెలకూరపాడు(ముప్పాళ్ల): గర్భిణులకు సకాలంలో అన్ని రకాల వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.రవి ఆదేశించారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను శుక్రవారం పరిశీలించారు. గ్రామాల్లోని మురుగు కాల్వలను పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించేలా చర్యలు చేపట్టాలన్నారు. మురుగు నిల్వ ఉంటే రోగాలు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుందని, ఇళ్లలోని నీటి తొట్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్రరత్నాకర్, పీహెచ్‌సీ వైద్యులు వి.జయకృష్ణ, సీహెచ్ఓ హర్షవర్ధన్, సత్తెనపల్లి మలేరియా అధికారి డి.చంద్రశేఖర్, సూపర్‌వైజర్లు ఎ.పీటర్ డేమియన్, రాజేష్, మనుతేజ, ఏఎన్ఎం కాశింబి, సౌజన్య, ఆశ కార్యకర్తలు రాధ, సుజాత పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ బి.రవి

డ్రెయినేజీ పనులను వేగవంతంగా చేపట్టాలి



నకరికల్లు: డ్రెయినేజీ నిర్మాణ పనులను నాణ్యతా లోపం లేకుండా వేగవంతంగా చేపట్టాలని ఎంపీడీఓ జి.కాశయ్య సూచించారు. స్థానిక సినిమా హాలు బజారులోని నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సినిమా హాలు బజారులో రూ.20 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పనుల వల్ల పగిలిపోయిన మంచినీటి పైపులైన్‌లకు మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని బంగ్లాగడ్డ వాసులు కోరారు. స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ సత్వరమే మరమ్మతులు చేయించి, తాగునీటిని పంపిణీ చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి



సామూహిక కుంకుమ పూజలో మహిళలు



కుందురువారిపాలెంలో అమ్మవారు



పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కన్నా



క్రోసూరు ఆలయంలో మహిళా భక్తుల పూజలు



నకరికల్లు ఆలయంలో కుంకుమ పూజ

సత్తెనపల్లి: పట్టణంలోని మాచర్ల రోడ్డులో ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు గణపతి పూజ నిర్వహించారు. అనంతరం సంఘం బజార్ లోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నుంచి అభిషేకానికి అవసరమైన పూజా ద్రవ్యాలను తీసుకొని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.అమ్మవారికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం బాధ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రత్యేక పూజలు

నకరికల్లు: కన్యకాపరమేశ్వరీ ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా నకరికల్లులోని అమ్మవారి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు తుంగతుర్తి విశ్వనాథ శాస్త్రి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. కుంకుమ పూజలో మహిళలు పాల్గొన్నారు. అమ్మవారి కీర్తనలు ఆలపిస్తూ భజనలు చేపట్టారు. సంఘం పెద్దలు అమ్మవారి విశేష చరిత్రను భక్తులకు వివరించారు.

అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా గ్రామంలో అమ్మవారి ఫొటోలు, కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం దేవాలయంలో వాసవీ మాత అష్టోత్తర, శతనామార్చనలు, భజన కార్యక్రమాలు చేపట్టారు.

కుందురువారిపాలెం(ముప్పాళ్ల): కుందురువారిపాలెంలోని శ్రీవాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు చిలకల సాంబశివరావు, కందకట్ల సుబ్బరామారావు, కోటేశ్వరరావు, చిలకల హరిప్రసాదు పాల్గొన్నారు.

క్రోసూరు: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి కలశాన్ని ఊరేగించారు. ఆర్యవైశ్య మహిళలు, భక్తులు అశేషంగా పాల్గొన్నారు.

ముగిసిన పశు ఆరోగ్య శిబిరాలు



గరికపాడులో పశు ఆరోగ్య శిబిరం



పశువులను పరీక్షిస్తున్న డాక్టర్ స్వాతీదేవి

క్రోసూరు: మండలంలో ఈ నెల 20 నుంచి నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలు శుక్రవారం గరికపాడు గ్రామంతో ముగిసినట్లు మండల పశు వైద్యుడు డాక్టర్ మల్లయ్య తెలిపారు. 12 రోజుల ఆరోగ్య శిబిరాల ద్వారా మొత్తం 502 పశువులకు సాధారణ చికిత్సలు, 322 గర్భకోశ వ్యాధులకు చికిత్స, 2,326 గెదెలు, దూడలకు, 5,006 జీవాలకు నట్టల నివారణ మందు వేసినట్లు తెలిపారు. అలాగే 600 జీవాలకు బొబ్బనివారణ, 100 కొక్కెర వ్యాధి నివారణ చికిత్సలు అందించినట్లు వెల్లడించారు. మొత్తం 8,856 పశువులు, జీవాలకు చికిత్సలు నిర్వహించగా 571 మంది పశుపోషకులు వినియోగించుకున్నట్లు తెలిపారు.


రామిరెడ్డి పేటలో పశువైద్య శిబిరం

రాజుపాలెం: మండలంలోని రామిరెడ్డి పేటలో పశు వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ శివకుమారి పశువులకు వైద్య పరీక్షలు అందించారు. 27 పశువులకు సాధారణ, 18 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 19 పశువులకు సూడు పరీక్షలు, 69 పశువులకు, 76 లేగ దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. 278 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసి, బొబ్బా టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది రమ్య, ఇందు, తేజ, ఆదినారాయణ, ఆనోక్, అఖిల, జగన్ మోహన్‌రావు, రాజేష్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పశువైద్య శిబిరాలు

అచ్చంపేట: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమైన పశువైద్య శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు కోగంటివారిపాలెం, చిగురుపాడు, రోకటిగుంటవారిపాలెం గ్రామాల్లో శిబిరాలు నిర్వహించినట్లు పశువైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. శిబిరాల్లో 180 దూడలకు, 367 పశువులకు, 2,162 జీవాలకు నట్టల నివారణ మందు, 2,163 జీవాలకు బొబ్బ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ శిబిరంలో 45 పశువులను పరీక్షించి పలు వ్యాధుల నివారణకు మందులు పంపిణీ చేశారు.

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతున్న అంధ కళాకారులు



గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

రాజుపాలెం: మండల కేంద్రంలోని నవోదయ పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన ఐవిధ అంధుల కళాకారుల సంగీత విభావరి శుక్రవారం నిర్వహించారు. పదిహేను అంధ కుటుంబాలు వివిధ పాఠశాల్లో ప్రోగ్రాంలు నిర్వహిస్తు జీవనం సాగిస్తున్నట్లు ఐవిధ ప్రతినిధి సుమ తెలిపారు. సంగీతం ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైరాన్ని నింపుతున్నారు. సమాజంలో తమ కాళ్ల మీద తాము ఎలా జీవించాలో వారి సంగీతం ద్వారా ధైర్యాన్ని నింపుతున్నారు. పాఠశాల డైరెక్టర్లు ప్రత్తి రామారావు, ప్రత్తి హనుమంతరావు, ప్రత్తి శ్రీనివాసరావు, ప్రత్తి జీవన్‌రావు పెద్ద మొత్తంలో సహాయ సహకారాలు అందించారు. ప్రత్తి కోటేశ్వరమ్మ రూ.2వేలు ఉపాధ్యాయులు రూ.3వేలు అందించారు.